సాక్షి నంద్యాల

మంగళవారం । 1 । జూలై । 2025



ధరణిలో దేవుళ్లు

వైద్యో నారాయణ హరిః అంటే వైద్యుడు దేవునితో సమానమని అర్థం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం బాగా లేనప్పుడు గుర్తొచ్చేది వీరే. నేడు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸



ప్రేమ పేరుతో మోసం

ప్రేమించినట్లు నమ్మించి.. పెళ్లి చేసుకుంటానని చెప్పి.. రూ.35 లక్షలు నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేయించుకుని ఒక మహిళ మోసం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. 8లో▸



ఆలయ భూమిలో అక్రమ బోరు

టీడీపీ నాయకుల బరితెగింపునకు మరో నిదర్శనం ఇది. ఏకంగా ఆలయ భూమిలో బోరు వేసి తన ఫ్యాక్టరీకి నీటిని తరలిస్తున్న వైనమిది. 8లో▸

న్యూస్‌రీల్

జడ్జి ఆకస్మిక తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి అమ్మన్నరాజు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సబ్ జైల్‌ను సోమవారం మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్నరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు పరిసరాలు, వంట, స్నానపు, తదితర గదులు పరిశీలించి సూచనలు చేశారు. ఖైదీల ఆరోగ్య వివరాలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులను వలన కుటుంబ సభ్యుల ప్రేమానురాగాలను కోల్పోతామని, కుటుంబ సభ్యులను దృష్టిలో పెట్టుకొని ఘర్షణలు, వివాదాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఖైదీలకు సూచించారు. ఆయన వెంట జైలర్ గురు ప్రసాద్ రెడ్డి, న్యాయవాది నాయక్, లోక్‌అదాలత్ సిబ్బంది రామచంద్రారెడ్డిలు పాల్గొన్నారు.

సుబ్రమణ్యేశ్వరుడి హుండీ ఆదాయం రూ. 25 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

పాణ్యం: కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ. 25 లక్షలు వచ్చింది. సోమవారం భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా..రూ. 25,03,320 నగదు, 8.600 గ్రాముల బంగారం, 830 గ్రాముల వెండి వచ్చింది. మార్చి 28 నుంచి జూన్ 30వ తేదీ వరకు భక్తుల సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ. రామకృష్ణ తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన బియ్యానికి వేలం పాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి హరిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

అన్నప్రసాద వితరణకు విరాళం



దాత కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న పర్యవేక్షకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి సోమవారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాకు చెందిన దురుదుండప్ప మనూరు రూ.లక్ష విరాళాన్ని పర్యవేక్షకులు దేవికకు అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన బి.కృష్ణారెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు రవికుమార్‌కు అందజేశారు. విరాళాన్ని అందించిన దాతలను దేవస్థానం తరుపున స్వామివారి శేష వస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.



పిల్లర్లకే పరిమితమైన అడ్మినిస్ట్రేషన్ భవన నిర్మాణం

వైద్య విద్య పునాదుల్లోనే!

- వైద్య విద్యను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.475 కోట్లతో నిర్మాణం
- మెడికల్ కళాశాల నిర్మాణంలో కనిపించని పురోగతి
- ఈ ఏడాది ప్రవేశాలు పొందే విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న 20 శాతం ఫ్యాకల్టీ సిబ్బంది



నిలిచిన హాస్టల్ భవన నిర్మాణం



నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల

సాక్షి, నంద్యాల: కూటమి ప్రభుత్వం వైద్య విద్యపై శీతకన్ను వేసింది. రూ. కోట్లతో చేపట్టిన కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలో నిర్లక్ష్యం చేయడంతో నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న దుర్దేశంతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓ వైపు కాలేజీలో ఫ్యాకల్టీ కొరత వేధిస్తున్నా భర్తీకి చర్యలు చేపట్టడం లేదు. మరో వైపు సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.475 కోట్లతో నంద్యాల మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టింది. నిధులు పక్కాగా కేటాయించడంతో పనులు శరవేగంగా సాగాయి. భవన నిర్మాణం పూర్తి కావడంతో 2023లో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు ప్రథమ సంవత్సరం 150 సీట్లు కళాశాలకు దక్కాయి. దీంతో సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే విద్యార్థులకు వైద్య విద్య అందుబాటులోకి వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వైద్య విద్యను పూర్తిగా గాలికొదిలేసింది. ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటు పరం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పెండింగ్‌లో ఉన్న కళాశాల నిర్మాణ పనులు పూర్తి చేయడంలో జాప్యం చేస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎంఎస్‌ఐడీసీ) ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం సక్రమంగా నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం కళాశాలలో రెండు తరగతి గదులు మాత్రమే ఉన్నాయి. ఈ ఏడాది ప్రవేశాలు పొందిన విద్యార్థులు వస్తే తరగతి గది లేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. కొన్ని భవన నిర్మాణాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దాదాపు ఎనిమిది నెలలు పెండింగ్ పనులను పట్టించుకోలేదు. రెండు నెలల క్రితం కొంత కదలిక కనిపించినా మళ్లీ అదే నిర్లక్ష్యం కనిపిస్తోంది.

వేధిస్తున్న అధ్యాపకుల కొరత

మెడికల్ కళాశాలలో దాదాపు 20 శాతం ఫ్యాకల్టీ కొరత ఉంది. 19 మంది ప్రొఫెసర్లు విధులు నిర్వహించాల్సి ఉండగా కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు. అలాగే వివిధ కారణాలతో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామకాలు ఆగిపోయాయి. కర్నూలు, నంద్యాల కలిపి రెండు మెడికల్ కళాశాలల్లో దాదాపు 156 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏమాత్రం మొగ్గు చూపడం లేదు.

ప్రాక్టికల్స్ కోసం ప్రభుత్వాసుపత్రికి..

ఫస్ట్, సెకండియర్ కలిపి ప్రస్తుతం 300 మంది వైద్య విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది కౌన్సెలింగ్ ద్వారా మరో 150 మంది విద్యార్థులు రానున్నారు. అయితే థర్డ్ ఇయర్ విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ ఎక్విప్‌మెంట్ ఇంకా అందుబాటులోకి రాలేదని తెలుస్తోంది. మరోవైపు విద్యా బోధనకు అవసరమైన మృతదేహాల కొరత కూడా వేధిస్తోంది. ప్రాక్టికల్స్ కోసం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి రావాల్సి వస్తోంది. కాలేజీకి ఆస్పత్రికి మధ్య కిలోమీటర్ దూరముంది. కళాశాలకు అనుబంధంగా ఉన్న జిల్లా ఆస్పత్రిని తరలించే విషయంలో మంత్రి, ఎంపీ మధ్య భేదాభిప్రాయాలు ఉండడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

కూటమి నిర్లక్ష్యం.. వైద్య విద్యకు దూరం

వైద్య విద్యను ప్రైవేటు పరం చేయాలనే దుర్దేశంతో కూటమి ప్రభుత్వం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన వైద్య కళాశాలల నిర్మాణాలను మధ్యలోనే నిలిపివేసింది. 2024లో మరో ఐదు కొత్త కాలేజీలను ప్రారంభించాల్సి ఉండగా కూటమి ప్రభుత్వమే దగ్గరుండి ఎన్‌ఎంసీకి లేఖ రాసి సీట్లు కేటాయించొద్దని కోరింది. దీంతో ఆ ఏడాది విద్యార్థులు సీటు రాక తీవ్ర మానసిక వేదనకు గురయ్యారు. మరో 5 కొత్త కాలేజీలో ప్రారంభించింటే పోటీ తగ్గి మరి కొంత మంది వైద్య విద్య చదివేందుకు అవకాశం ఉంటుంది. 2023తో పోలిస్తే 2024లో ఎక్కువ మార్కులు సాధించిన వారికి మాత్రమే సీట్లు వచ్చాయి. 2023లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఏ కేటగిరిలో 578 మార్కుల నుంచి రిజర్వేషన్ల వారీగా 184 మార్కులు సాధించిన విద్యార్థులకు సీట్లు వచ్చాయి. బీ కేటగిరిలో 536 నుంచి 417 మార్కులు మధ్య వచ్చిన వారు సీట్లు పొందారు. సీ కేటగిరీలో 349 నుంచి 116 మార్కులు వచ్చిన వారికి సీట్లు దక్కాయి. 2024లో ఏ కేటగిరిలో 659 మార్కుల నుంచి రిజర్వేషన్ల వారీగా 402 మార్కుల మధ్య వచ్చిన విద్యార్థులకు సీట్లు దక్కాయి. బీ కేటగిరిలో 591 నుంచి 509 మార్కుల మధ్య వచ్చిన వారికి.. సీ కేటగిరిలో 422 నుంచి 310 మధ్య మార్కులు సాధించిన వారికి సీట్లు దక్కాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పేరు వస్తుందని...



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 కళాశాలల నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా 5 కళాశాలలను ప్రారంభించారు. 2024లో మరో ఐదు కాలేజీలను ప్రారంభించాల్సి ఉండగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కాలేజీలపై కక్ష కట్టింది. నిధులు కూడా మంజూరు చేయడం లేదు. తెలంగాణలో ప్రభుత్వం మారినా విద్యార్థులను ఇబ్బంది పెట్టలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన కళాశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించింది. ఏపీలో అందుకు విరుద్ధంగా సీఎం చంద్రబాబు ఆలోచనధోరణి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పేరు వస్తుందనే దుర్దేశంతో వైద్య విద్యను పూర్తిగా పక్కన పెట్టారు.

– డాక్టర్ శశికళ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జనరల్ సెక్రటరీ, నంద్యాల

వైద్య విద్యను ప్రైవేటు పరం చేసే కుట్ర



కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటు పరం చేసే కుట్ర చేస్తోంది. 2024లో ఐదు కళాశాలల నిర్మాణాలు పూర్తయినా ప్రారంభించ లేదు. దీంతో విద్యార్థులు 750 సీట్లను కోల్పోవాల్సి వచ్చింది. ఈ సంవత్సరంలో మిగిలిన కాలేజీలను కూడా పక్కన పడేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంలో 14 ఏళ్ల పాటు సీఎంగా చేసిన చంద్రబాబు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏ ఒక్క కళాశాలను నిర్మించ లేదు. మాజీ సీఎం వైఎస్ జగన్ ఉన్నతంగా ఆలోచించి 17 కళాశాలల నిర్మాణం చేపడితే వాటిని కూడా అడ్డుకోవడం హేయం.

– ఎంఆర్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, నంద్యాల

చట్ట పరిధిలో ఫిర్యాదులకు సత్వర న్యాయం

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన చట్ట పరిధిలో ఫిర్యాదులకు సత్వరమే పరిష్కరించి న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో పీఆర్‌ఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎస్పీ, అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో 160 వినతులు వచ్చాయని, వీటిని పరిష్కరించేందుకు ఆయా స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వినతులు మళ్లీ పునరావృతం కాకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు.

వినతుల్లో కొన్ని..

- పాణ్యం మండలం తమ్మరాజులపల్లె గ్రామానికి చెందిన పుల్లయ్య, గురువయ్య, తదితర రైతులు 2024లో బేయర్ కంపెనీకి చెందిన మొక్కజొన్న సీడ్ విత్తనాలు సాగు చేశారు. క్వింటాల్‌కు రూ.3,500 ప్రకారం కొనుగోలు చేస్తామని, నష్టం వస్తే రూ.80 వేల వరకు పరిహారం ఇస్తామని ఏజెంట్లు నమ్మించారు. పంట నష్టం జరగడంతో కంపెనీ యాజమాన్యాన్ని నష్టపరిహారం ఇవ్వమని అడగగా కొన్ని నెలలుగా తిప్పుకుంటున్నారని, నకిలీ విత్తనాలు ఇచ్చి మోసం చేసిన కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి పత్రం అందజేశారు.
- అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన చిన్న రవి రైల్వేలో టీసీ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.14 లక్షలు తీసుకొని మోసం చేశాడని, డబ్బులు ఇవ్వమంటే ఇవ్వడం లేదని, అతనిపై చర్యలు తీసుకోవాలని కొలిమిగుండ్ల మండలం కంబవారిపల్లె గ్రామానికి చెందిన శంకర్‌నారాయణ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.
- గత 60 సంవత్సరాలుగా చంద్రపాల్ పొలం మీదుగా ఉన్న రస్తాలో మా పొలానికి వెళ్తున్నాని, ఈ ఏడాది నుంచి అతని పొలం మీదుగా వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామానికి చెందిన బండిస్వామిదాసు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బాధ్యతగా వినతులు పరిష్కరించండి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా వినతులను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్‌లు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్ దరఖాస్తులను ఎలాంటి నిర్లక్ష్యం చూపకుండా నిర్ణీత కాల పరిమితి లోపు నాణ్యతగా పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్‌ను కూడా వారికి అర్థమయ్యే రీతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా అర్జీలను పరిష్కరించాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక వచ్చే దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్ చైర్, ర్యాంపు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా అధికారులు జరిపే ఉత్తర, ప్రత్యుత్తరాలు కేవలం ఈ ఆఫీస్ ద్వారానే పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గుర్తించిన 42 వేల మంది బంగారు కుటుంబాలు, 2800 చెంచు కుటుంబాలు ఉన్నాయని వారికి అవసరమైన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాల్లో బాత్‌రూమ్స్, మరుగుదొడ్లు నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 284 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

డెంగీ మాసోత్సవాలను విజయవంతం చేయండి

జిల్లాలో జూలై 1 నుంచి నిర్వహించే డెంగీ మాసోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో డెంగీ మాసోత్సవాలకు సంబంధించిన ప్రచార పత్రాలను జేసీ విష్ణుచరణ్, వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దోమల నివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జూలై నెల పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్ జూలై నెల పంపిణీ కార్య క్రమం మంగళవారం ఉదయం మొదలుకానుంది. ఉమ్మడి జిల్లాలో 4,49,525 పింఛన్లు ఉండగా సోమవారం బ్యాంకులకు రూ.194.61 కోట్లు విడుదలయ్యా యి. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే సచివాలయ ఉద్యోగులందరూ మూడు రోజులుగా బదిలీల కోసం కర్నూలులోనే ఉండిపోయారు. ఇప్పటి వరకు ఎవ్వరికీ బదిలీ ఉత్తర్వులు జారీ కాని పరిస్థితి. ఈ నేపథ్యంలో వీళ్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులు సచివాలయాల వద్ద బారులుదీరాల్సిందేననే అనుమానం వ్యక్తమవుతోంది. జూన్ నెలలో మంజూరైన స్పౌజ్ పింఛన్లను కూడా జూలై నెలలోనే పంపిణీ చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి తెలిపారు.

అభ్యంతరాలు.. ఆందోళనలు

- గందరగోళంగా ఏఎన్‌ఎంల బదిలీల ప్రక్రియ

కర్నూలు(హాస్పిటల్): అభ్యంతరాలు, ఆందోళనల మధ్య గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కర్నూలు మెడికల్ కాలేజీలోని న్యూ ఆడిటోరియంలో ఉదయం 7.30 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన 750 మందికి పైగా ఏఎన్‌ఎంలకు బదిలీ కౌన్సిలింగ్ చేయాల్సి ఉంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.శాంతికళ, ఏవో అరుణ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు వచ్చాయి. వందకు పైగా ఎమ్మెల్యే సిఫార్సు లేఖలు రావడం, అందులోనూ కొన్ని సచివాలయాలకు ఎక్కువ మందికి లేఖలు ఇవ్వడంతో అధికారులు అయోమయానికి గురయ్యారు. ఈ లేఖలతో పలు సంఘాల లేఖలను సైతం పక్కన బెట్టి ర్యాంకు ఆధారంగా సాయంత్రం 200 మందికి మాత్రమే కౌన్సెలింగ్ చేశారు. అర్ధరాత్రి వరకు కొనసాగించి, మిగిలిన వారికి మంగళవారం కూడా కౌన్సెలింగ్ చేస్తామని అధికారులు ప్రకటించారు. ఈ క్రమంలో కొందరు ఏఎన్‌ఎంలు ఇతర పీహెచ్‌సీలకు గాకుండా పక్క పీహెచ్‌సీలోని సచివాలయాలకు బదిలీ చేయాలని నినాదాలు చేశారు. దీంతో అధికారులు భోజన విరామాన్ని ప్రకటించి ఉన్నతాధికారుల వివరణ తీసుకుని పక్క పీహెచ్‌సీలకు సచివాలయ ఉద్యోగులను బదిలీ చేసేందుకు అంగీకరించారు.



ఏఎన్‌ఎంలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందులన్నీ అందుబాటులో ఉంచాలి

గడివేముల: ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారికి అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని నంద్యాల జిల్లా ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన హెల్త్‌బ్లాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఈహెచ్‌ఆర్ డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సిబ్బంది ప్రతి రోజు సమయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రంజిత కుమారి, ఎంపీహెచ్‌ఈఓలు శివరామయ్య, వెంకటసుబ్రమణ్యం, పీహెచ్‌ఎన్ సర్వేశ్వరమ్మ, సూపర్‌వైజర్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సభకు భారీగా హాజరైన ముస్లింలు

వక్ఫ్ బచావో.. దస్తూర్ బచావో



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

వక్ఫ్ బోర్డు చట్టంలో సవరణలను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం కర్నూలు ఎస్టీబీసీ కళాశాల మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సభకు ముస్లింలు వేలాదిగా తరలివచ్చారు. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముస్లింలకు చంద్రబాబు మోసం చేశారన్నారు. టీడీపీలో పనిచేస్తున్న ముస్లింలు బయటకు రావాలని పిలుపునిచ్చారు. – కర్నూలు టౌన్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో తెలంగాణ వాసి మృతి


మృతుడు రాఘవేందర్

శిరివెళ్ల: నల్లమల అటవీ ప్రాంతంలోని పచ్చర్ల సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్‌కు చెందిన బచ్చు రాఘవేందర్ (36) మృతి చెందాడు. ప్రకాశం జిల్లా గిద్దలూరులో ఉన్న తన బంధువులను చూడడానికి కారులో వెళ్తూ మార్గమధ్యలో పచ్చర్ల వద్ద మూత్ర విసర్జన కోసం కారు దిగాడు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో రాఘవేందర్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండంగా మృతి చెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


భార్యను చంపిన భర్త అరెస్ట్


అరెస్టు చూపుతున్న పోలీసులు

మంత్రాలయం: అనుమానం పేరుతో తాగిన మైకంలో భార్యను హత మార్చిన భర్త హనుమంతును పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శివాంజల్ మాట్లాడుతూ.. సూగూరు గ్రామానికి చెందిన బోయ హనుమంతు ఆయన భార్య లక్ష్మీదేవి నిద్రిస్తున్న సమయంలో మేడిగుంజతో తలపై బాది హత్య చేశారని, అనుమానం పేరుతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నారన్నారు. చెట్నిహళ్లి గ్రామ మార్గంలోని అభయాంజనేయ స్వామి ఆలయ సమీపంలో హనుమంతును అరెస్టు చేశామన్నారు.

ధరణిలో దేవుళ్లు

- నమ్మకమే వైద్యులకు పునాది
- పెద్దాసుపత్రిలో అన్ని రకాల ఆధునిక సేవలు
- కార్పొరేట్ ఆసుపత్రుల రాకతో మెరుగైన వైద్య సేవలు
- హైదరాబాద్‌కు ధీటుగా సేవలందిస్తున్న కర్నూలు వైద్యులు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం




కర్నూలు(హాస్పిటల్): వైద్యో నారాయణ హరీః. అంటే వైద్యుడు దేవునితో సమానమని అర్థం. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం బాగా లేనప్పుడు ముందుగా గుర్తొచ్చేది వీరే. రోగుల ప్రాణాలు కాపాడటమే ధ్యేయంగా ఎంతో మంది వైద్యులు పడుతున్న కష్టం వర్ణణాతీతం. ఇంజినీర్లు పెద్ద పెద్ద పరికరాలతో కుస్తీ పడుతుండగా వైద్యులు మాత్రం అతి సూక్ష్మంగా కనిపించే అవయవాలు, కణాలు, రక్తనాళాలను సైతం ఒడిసిపట్టి చికిత్స చేస్తూ ప్రాణాలను నిలుపుతున్నారు. ఇటీవల అత్యాధునిక వైద్య పరికరాలు, వసతులు, సౌకర్యాల వల్ల ఎంతో క్లిష్టమైన చికిత్సలు కూడా సులభంగా మారుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌తో సమానంగా కర్నూలులోనూ వైద్యులు అరుదైన చికిత్సలతో సత్తా చూపుతున్నారు.

పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 36కు పైగా విభాగాలున్నాయి. 1956లో 50 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభమైన ఈ బోధనాసుపత్రి ఇప్పుడు 250 సీట్లతో కొనసాగుతోంది. రాష్ట్రంలోనే ఏకైక సువిశాలమైన ఈ ఆసుపత్రికి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచే గాక అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, రాయచోటి, ప్రకాశం, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి రోగులు అధిక సంఖ్యలో చికిత్స కోసం వస్తుంటారు. ప్రైవేటుగా ఎన్ని ఆసుపత్రులు వచ్చినా ఓపీ రోగుల సంఖ్య ఏ మాత్రం తగ్గడం లేదు. ప్రతిరోజూ 2 వేలకు పైగా రోగులు ఓపీ చికిత్స పొందుతున్నారు. నిత్యం అడ్మిషన్‌లో ఉన్న వెయ్యి నుంచి 1200 వరకు రోగులకు సేవలు అందుతున్నాయి.

పోయే చూపును తెప్పించాం



కోడుమూరు మండలం వలుకూరుకు చెందిన హనుమన్న (48) 2009లో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల ఛిద్రమై మెదడు బయటకు వచ్చింది. ఒక కన్ను పూర్తిగా దెబ్బతినగా మరో కంటికి గాయం కారణంగా శుక్లం వచ్చి చూపు మందగించింది. అతనికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అత్యవసర చికిత్స అందించి ప్రాణం పోశాం. ప్లాస్టిక్ సర్జరీ వైద్యులు 13 సార్లు దశల వారీగా ఆపరేషన్ చేసి ఛిద్రమైన ముఖాన్ని బాగు చేశారు. తర్వాత ఒక కన్ను కోల్పోయి దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ భిక్షాటన చేస్తూ బతుకుతున్న అతన్ని ఆసుపత్రికి తీసుకురాగా శస్త్రచికిత్స చేసి చూపు తెప్పించాం. దీంతో అతడు భిక్షాటన మానేసి పనులు చేసుకుంటూ బతుకుతున్నాడు.

– డాక్టర్ పి.సుధాకర్‌రావు, కంటి వైద్యనిపుణులు, కర్నూలు

ఆమె ధైర్యం, స్థైర్యానికి హ్యాట్సాఫ్



వైద్యులుగా ఎంతో మందికి చికిత్స చేస్తూనే రోగులు చేసే ప్రయాణంలో సహచరులుగా నిలుస్తున్నాం. ఒక రోగి క్లిష్టమైన దశలను దాటి కోలుకున్నప్పుడు వారి ముఖంలో కనిపించే చిరునవ్వు మాకు అత్యంత సంతృప్తినిస్తుంది. ఆశలు లేవనుకుంటున్న ఓ వితంతువు స్క్లెరోడెర్మా అనే వ్యాధితో బాధపడుతూ మృత్యువుతో పోరాడుతోంది. ఆమె ధైర్యం, ఆత్మవిశ్వాసం, జీవించాలనే తపన ఆమెను ముందుకు నడిపించాయి. ఆమెకు మేము అందించిన చికిత్సతో పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం స్వతంత్రంగా పనిచేసుకుంటూ పిల్లలకు, కుటుంబానికి ఆసరాగా ఉంటూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. – డాక్టర్ శ్రీహరిరెడ్డి, కీళ్లవాత వ్యాధి నిపుణులు, కర్నూలు

ఆ మానసిక రోగి నేడు అమెరికాలో ఐటీ ఉద్యోగి



నేను కర్నూలులో 1992 నుంచి మానసిక రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాను. 25 ఏళ్ల క్రితం ఓ డాక్టర్ ఇంటర్ పూర్తయిన తన కుమారుడిని డిప్రెషన్, ప్రవర్తనా రాహిత్య రుగ్మతలతో నన్ను సంప్రదించారు. ఆ అబ్బాయికి నేనిచ్చిన ఔషధాలు, కౌన్సెలింగ్ వల్ల మానసిక రుగ్మతల నుంచి బయటపడి ప్రస్తుతం అమెరికాలో ఐటీ ఉద్యోగిగా స్థిరపడి సంతోషంగా జీవిస్తున్నాడు. అలాగే ఒక బ్రాహ్మణ వేద పండిత విద్యార్థి మంత్రోచ్చారణ సరిగ్గా చేయలేకపోతున్నానని, తీవ్రమైన డిప్రెషన్‌కు లోనై ఆత్మహత్య ఆలోచనలతో నన్ను సంప్రదించాడు. అతనికి అందించిన చికిత్స వల్ల ప్రస్తుతం కర్నూలులో ప్రముఖ బ్రాహ్మణోత్తముడిగా సేవలందిస్తున్నారు.

– డాక్టర్ బి.రమేష్‌బాబు, మానసిక వ్యాధుల వైద్యనిపుణులు, కర్నూలు

ఆనందంతో గ్రామస్తులు సన్మానం చేశారు



తెలంగాణ రాష్ట్రంలోని అలంపూర్‌కు చెందిన శ్రీనివాసులు (65) గత మార్చిలో గుండె సమస్యతో మా వద్దకు వచ్చారు. అతనికి పరీక్షలు నిర్వహించగా గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే ప్రధాన నాళం 70 శాతం మూసుకుపోయిందని గుర్తించాం. ఎల్ఎస్‌సీఏ నుంచి ఎల్ఏడీకి స్టంట్ వేయడం కష్టంతో కూడుకున్న పని. దీంతో వెంటనే రోగిని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని, ఇలాంటి ఆపరేషన్లు అక్కడు చేస్తారని సూచించాం. కానీ మాపై ఉన్న నమ్మకంతో ఇక్కడే చికిత్స చేయాలని కుటుంబసభ్యులు కోరారు. రిస్క్ తీసుకుని అతనికి స్టంట్ వేశాం. అన్ని జాగ్రత్తలతో చికిత్స అందించడంతో ఆయన పూర్తిగా కోలుకున్నాడు. దీంతో అలంపూర్ గ్రామస్తులు పెద్దఎత్తున వచ్చి నన్ను ఘనంగా సన్మానించి పొగిడారు. భావోద్వేగంతో ఆనందబాష్పాలు వచ్చాయి. –డాక్టర్ ఎస్.చైతన్యకుమార్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు, కర్నూలు

ఆలయ భూమిలో టీడీపీ నేత అక్రమ బోరు


శివాలయం ఆవరణలో వేసిన అక్రమ బోర్

ప్యాపిలి: టీడీపీ నాయకుల బరితెగింపునకు మరో నిదర్శనం ఇది. ఏకంగా ఆలయ భూమిలో బోరు వేసి తన ఫ్యాక్టరీకి నీటిని తరలిస్తున్న వైనమిది. గొల్లపల్లి బుగ్గలోని స్థానిక శివాలయం ఆవరణలో డోన్ పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు మహేశ్ ఖన్నా అక్రమంగా బోర్ వేసి శివాలయం నుంచి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న తన సుద్ద ఫ్యాక్టరీకి పైప్‌లైన్ సౌకర్యం కల్పించుకున్నాడు. అధికారుల అనుమతి లేకుండా ఏకంగా శివాలయం ఆవరణలో బోర్ వేసుకోవడం స్థానికంగా విమర్శలకు దారి తీస్తోంది. అయితే ఈ బోర్ నుంచి పైప్‌లైన్ వేసుకుని తన ఫ్యాక్టరీకి నీటి సౌకర్యం కల్పించుకోవడం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బీజేపీ నాయకుల ఫిర్యాదు

కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షమైన బీజేపీ నాయకులు ఈ సంఘటనపై కొద్దిరోజుల క్రితమే తహసీల్దార్ భారతికి ఫిర్యాదు చేశారు. బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు కేసీ మద్దిలేటి, ప్యాపిలి మండల బీజేపీ నాయకులు దామోదర్ నాయుడు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అయినప్పటికీ తహసీల్దార్ ఈ విషయంలో చర్యలు తీసుకోకపోవడం పట్ల బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సైకిల్‌పై నుంచి కింద పడి విద్యార్థి మృతి


మృతి చెందిన చరణ్

కోవెలకుంట్ల: స్థానిక సంతపేటకు చెందిన ఓ విద్యార్థి సోమవారం రాత్రి సైకిల్‌పై నుంచి కింద పడి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కాలనీకి చెందిన చాకలి మధుసూదన్, లక్ష్మీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు సంతానం. రజకవృత్తి చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిన్నకుమారుడు చరణ్(11) పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రాత్రి ఇంటి వద్ద సైకిల్ తొక్కుతూ కింద పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన చుట్టుపక్కలి వారు చికిత్స నిమిత్తం స్థానికంగా ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్య సిబ్బంది నంద్యాలకు తీసుకెళ్లాలని సూచించారు. మెరుగైన వైద్యం కోసం తరలించే లోపే మృతి చెందటంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సైకిల్ తొక్కుతూ కింద పడి తలకు బలమైన గాయమై మృతి చెందాడా, కింద పడటంతో భయానికి గురై మృత్యువాత పడ్డాడా అని కాలనీవాసులు చర్చించుకుంటున్నారు.

వ్యవసాయ పనుల్లేక..


జూపాడుబంగ్లా సిద్ధేశ్వరం పేట కాలనీలో బారకట్ట ఆడుతున్న మహిళలు

జూలై మాసం ప్రారంభమైంది. సాధారణంగా ఈ సమయంలో ఖరీఫ్ పనులు ఊపందుకుని పొలాల్లో ఎటు చూసినా రైతులు, వ్యవసాయ కూలీలు బిజీగా ఉండేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వానల్లేక పొలాలు బీళ్లను తలపిస్తున్నాయి. పనుల్లేక ఇళ్ల వద్ద వ్యవసాయ కూలీలు ఖాళీగా ఉంటున్నారు. కుటుంబాలు గడవటం కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోక చెట్ల కింద కూర్చొని మహిళలు బారకట్ట, పురుషులు పులిజీతం వంటి ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు. – జూపాడుబంగ్లా

టీబీ డ్యాంకు తగ్గిన ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఉన్నట్టుండి ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో క్రస్టుగేట్ల ఎత్తివేత మరింత ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఆదివారం డ్యాంకు 65వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. సోమవారం దాదాపు 40 వేల క్యూసెక్కులకు పడిపోయింది. జలాశయం ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పాటు డ్యాంపై నిర్మించిన శివమొగ్గలోని అప్పర్ తుంగా ప్రాజెక్టు(గాజనూరు జలాశయం) నుంచి దిగువకు నీటి నిడుదలను నిలిపివేశారు. దీంతో టీబీ డ్యాంకు వచ్చే వరద సగానికి తగ్గింది. ప్రస్తుతం డ్యాంలో 74 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అయితే 80 టీఎంసీలకు చేరితే క్రస్టు గేట్లు ఎత్తి నీటిని నదికి వదులుతారు. ఈ లెక్కాన గేట్లు ఎత్తడానికి మరో రెండు, మూడు రోజులు పట్టవచ్చని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఈ నెల 10న తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు నీటిని విడుదల చేయనుండడంతో రైతులు వరిసాగుకు సిద్ధమయ్యారు.

'ఉపాధి'లో అక్రమాలు

- విచారణ చేయాలని కోరిన జెడ్పీటీసీలు


జేసీ నవ్యకు వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలు ఎక్కువ జరుగుతున్నాయని, విచారణ చేపట్టాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో జెడ్పీటీసీలు మౌలాలి, రామకృష్ణ, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ తదితరులు జేసీ డాక్టర్ బి.నవ్యను కలసి వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ఉపాధి హామీ పథకం అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారిందని ఆరోపించారు. సర్పంచ్‌లకు తల్లికి వందనం ఇవ్వాలని, ఆర్టికల్స్ 73,74 ప్రకారం పంచాయతీరాజ్ విభాగాలకు అధికారాలను బదలాయించాలని కోరారు. స్థానిక సంస్థలు వసూలు చేసిన పన్నులను ఆయా సంస్థల ఖాతాల్లో జమ చేయాలని, ఉపాధి హామీ పనులను పంచాయతీల ద్వారానే జరిపించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలు ఇవీ..

- కర్నూలులోని వైన్ షాపుల్లో సిట్టింగ్ టేబుళ్లను ఏర్పాటు చేసి బహిరంగ విక్రయాలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు.
- శరీన్‌నగర్ గట్టయ్యనగర్ ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులను అక్కడే కొనసాగించాలని జేసీకి వినతిపత్రం అందజేశారు.
- వెల్దుర్తి మండలం పుల్లగుమ్మిలో ఐరన్ ఓర్‌తో పంటపొలాలను నాశనం చేస్తున్న సీతారామయ్యపై చర్యలు తీసుకోవాలని రైతులు అర్జీ ఇచ్చారు.
- రీడిప్లాయ్‌మెంట్ పేరుతో ఎంపీహెచ్ఏ ఫిమేల్, సెకండ్ ఏఎన్ఎంలను దూర ప్రాంతాలకు కేటాయించడం అన్యాయమని, పూర్వ స్థానాలకు కేటాయించాలని కోరుతూ జేసీకి వినతిపత్రం ఇచ్చారు.
- ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో కేజీబీవీల్లో సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులకందరికీ కేటాయించాలని అర్జీ ఇచ్చారు.
- నందవరం మండలం హలహర్వి గ్రామంలో వేలంపాటలతో 5.71 లక్షలకు దక్కించుకున్నామని, జూలై 2వ తేదీన మళ్లీ వేలం వేయడానికి నిర్ణయించారని, దానిని తమకే అప్పగించాలని యాపిలయ్య అర్జీ ఇచ్చారు.

11కేవీ సర్వీసు వైర్లను మార్చాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం ఉల్చాలలో ప్రమాదకరంగా మారిన 11 కేవీ సర్వీసు వైర్లను మార్చాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామంలో మిద్దెల పైన నిలబడితే సర్వీసు వైర్లు చేతులకు అందే విధంగా ఉన్నాయన్నారు. దీంతో చాలారోజులుగా వాటిని మార్చాలని కోరుతున్నా విద్యుత్ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం ఇచ్చారు. గ్రామస్తులు హరికిషన్ రెడ్డి, విశ్వనాథ్,రఘువరణ్, గోవర్ధన్, ఇబ్రహీం,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అఖండ సౌభాగ్యం.. వారాహి అమ్మవారి దర్శనం


పసుపు కొమ్ముల అలంకరణలో వారాహి అమ్మవారు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాసం సోమవారం పురస్కరించుకొని వారాహి అమ్మవారికి అభిషేకం చేశారు. ముత్తైదువులకు అఖండ సౌభాగ్యం కలగాలని పసుపు కొమ్ములతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. లలితా పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన బోయ మనోహర్

వెల్దుర్తి: బైక్‌ను కారు ఢీకొనడంతో వెల్దుర్తి మండలం చెరుకులపాడు గ్రామానికి చెందిన బోయ మనోహర్(19) మృతి చెందాడు. ఈ దుర్ఘటన కల్లూరు మండలం కొంగనపాడు వద్ద హైవే 44 ఓవర్ బ్రిడ్జిపై సోమవారం జరిగింది. ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తెలిపిన వివరాల మేరకు.. చెరుకులపాడుకు చెందిన గౌండ, కూలీలైన రామకృష్ణ, బోయ మనోహర్ కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో ఇంటి పని చేస్తున్నారు. స్వగ్రామం నుంచి ఉదయం 7 గంటలకు బైక్‌పై బయలుదేరారు. ఉలిందకొండ సమీపంలోని హైవేలోని కొంగనపాడు బ్రిడ్జ్ దిగంగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కింద పడిన ఇద్దరూ గాయపడ్డారు. ఉలిందకొండ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను 108లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బోయ మనోహర్ మృతి చెందాడు. మృతుడు బోయ మనోహర్ తండ్రి నాగమద్దయ్య సైతం రెండేళ్ల క్రితం వెల్దుర్తి హనుమాన్ జంక్షన్‌లో లూనా మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి శివలింగమ్మ కన్నీటి పర్యంతమైంది. విషయం తెలుసుకున్న పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కర్నూలు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. చికిత్స పొందుతున్న రామకృష్ణకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కాగా..సీసీ కెమెరాలు, ఇతర మార్గాల ద్వారా ఢీకొన్న కారు నంబరును పోలీసులు గుర్తించారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

ఎస్సీ వర్గీకరణ సభకు తరలిరండి

కర్నూలు (అర్బన్): ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామంలో ఈనెల 7వ తేదీన జరగనున్న జాతీయ స్థాయి ఎస్సీ వర్గీకరణ విజయోత్సవ సభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య నేతలు కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక రాక్‌వుడ్ హైస్కూల్‌లో అభ్యున్నతి ఛారిటబుల్ ట్రస్ట్, ఎమ్మార్పీఎస్, ఎస్సీ మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎస్సీ మాదిగ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి, అభ్యున్నతి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కె.రామాంజినేయులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆర్‌జే ప్రకాష్ మాదిగ, రెడ్డిపోగు డేవిడ్ మాదిగ, బి.మోజెస్ మాదిగ, ఐజే అమలనాథన్ మాదిగ, ఏపీ సుబ్బయ్య మాదిగ, ప్రొఫెసర్ పుణ్యశేషుడు మాదిగ, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు, చంద్రుడు మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుదీర్ఘ అవిశ్రాంత దండోరా ఉద్యమం ద్వారా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సాధించామన్నారు.

తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని మోసం

- ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు


ముఠా సభ్యులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని మోసం చేసిన నెల్లూరు జిల్లాకు చెందిన పోతురాజు రతన్ కుమార్, పాలకీర్తి జశ్వంత్, పోతురాజు శాంతి పవన్‌కుమార్, కట్ట శ్రీకాంత్ అలియాస్ విశ్వనాథ్‌లను కర్నూలు మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. విజయవాడ పట్టణం సూర్యారావుపేట భద్ర హైట్స్ ఫ్లాట్ నెం.105లో నివాసముంటున్న డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కర్నూలులోని పావని లాడ్జిలో ఉండగా తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని చెప్పి రూ.7.32 లక్షలు తీసుకుని మోసం చేశారు. ఈ మేరకు ఇచ్చిన ఫిర్యాదుతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా పక్కా ఆధారాలతో నిందితులను అరెస్టు చేసి కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. సీఐలు శేషయ్య, నాగశేఖర్, ఎస్ఐ బాలనరసింహులుతో కలసి డీఎస్పీ బాబు ప్రసాద్ సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. వీరి నుంచి రూ.6.40 లక్షల నగదు, నాలుగు కార్లు, నకిలీ బంగారు బిస్కెట్లు, పోలీసులు వాడే సామగ్రితో పాటు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ముఠాకు ప్రధాన సూత్రధారులైన దేవరకొండ సుధీర్, పీటర్ పాల్, శివకుమార్‌రెడ్డిలు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామన్నారు.

విద్యాసంస్థల బస్సుల తనిఖీ

కర్నూలు: విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు తరలించే బస్సుల కండీషన్‌ను ట్రాఫిక్ పోలీసులు పరిశీలించారు. నగరంలోని విద్యాసంస్థల బస్సులను సోమవారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు రప్పించి వాటి సామర్థ్యాన్ని పరిశీలించారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న బస్సులను మాత్రమే విద్యార్థులను తరలించేందుకు వినియోగించాలని రవాణా శాఖ అధికారి రాజేందర్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సూచించారు. ఈ సందర్భంగా డ్రైవర్లకు సీపీఆర్, ప్రథమ చికిత్స గురించి అవగాహన కల్పించారు. యాజమాన్యాలు బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని, హెవీ లైసెన్స్ కలిగిన సీనియర్ డ్రైవర్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దాదాపు 40 బస్సులను తనిఖీ చేసి జీఓ నంబర్ 286 ఎఫ్‌లోని భద్రత ప్రమాణాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.

ప్రేమ పేరుతో రూ.35 లక్షల మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- పీజీఆర్ఎస్‌కు 135 ఫిర్యాదులు


ఎస్పీకి సమస్యలు చెప్పుకుంటున్న ప్రజలు

కర్నూలు: 'ప్రేమించినట్లు నమ్మించి.. పెళ్లి చేసుకుంటానని చెప్పి.. గోల్డ్ కాయిన్స్ తీసుకుని.. రూ.35 లక్షలు నగదు బ్యాంక్ ఖాతాలో జమ చేయించుకుని ఒక మహిళ మోసం చేసింది' అని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు కర్నూలు కొత్తపేటకు చెందిన మునీర్ అహ్మద్ ఖురేషి ఫిర్యాదు చేశారు. తాను లండన్‌లో హోటల్ మేనేజర్‌గా పనిచేస్తుండగా కడప జిల్లాకు చెందిన ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్, వీడియో కాల్స్ చేస్తూ రెండున్నర సంవత్సరాల క్రితం పరిచయమై, చెన్నైలోని ఇన్ఫోటెక్‌లో ఉద్యోగం చేస్తున్నానని చెప్పిందన్నారు. తాను లండన్ నుంచి జూన్ 4వ తేదీన కర్నూలుకు వచ్చానని, 5వ తేదీ నుంచి తన మొబైల్ నంబర్‌ను బ్లాక్ చేసి ఆ మహిళ మోసం చేసిందని మునీర్ అహ్మద్ ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

135 ఫిర్యాదులు

రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్ఎస్‌కు మొత్తం 135 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసాచారి కూడా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- కర్నూలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.6 లక్షలు తీసుకుని మోసం చేశారని మంత్రాలయం మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన రాజు, మునిస్వామి ఫిర్యాదు చేశారు.
- పూణెలోని జీకే వర్క్స్ అసోసియేషన్ ఇంజనీరింగ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని, సంవత్సరానికి రూ.5 లక్షలు ప్యాకేజీ ఉంటుందని కడప పట్టణానికి చెందిన అశోక్ కుమార్ రూ.1.50 లక్షలు తీసుకుని నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చి మోసం చేశాడని కర్నూలు మాధవీ నగర్‌కు చెందిన చంద్రకళ ఫిర్యాదు చేశారు.
- ఇద్దరి పిల్లలకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి జీషిత్ రాణి, శ్రేయస్ రూ.4.30 లక్షలు తీసుకుని బోగస్ కంపెనీలో ఉద్యోగం ఇప్పించి మోసం చేశారని కర్నూలు ఉద్యోగనగర్‌కు చెందిన ఆర్.ప్రకాష్ రాజు ఫిర్యాదు చేశారు.
- పత్తికొండ కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్ పెండింగ్‌లో ఉన్నప్పటికీ తన పొలంలోకి అక్రమంగా చొరబడి కొందరు ఆటంకాలు కలిగిస్తున్నారని తుగ్గలి గ్రామానికి చెందిన మంగలి రంగమ్మ ఫిర్యాదు చేశారు.